## క్లుప్తంగా

### ఎనిమిది మంది పాత నేరస్తుల బైండోవర్

దేవరపల్లి: సత్ప్రవర్తన నిమిత్తం సారా కేసుల్లో పాత నేరస్తులైన దేవరపల్లికి చెందిన ఎనిమిది మందిని బుధవారం మండల తహసీల్దార్ ఎం.రామకృష్ణ ముందు హాజరు పరిచినట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ దిమ్మల సుధ బుధవారం తెలిపారు. ఈ నేరస్తులు తిరిగి మరలా నేరాలకు పాల్పడితే ఏడాది జైలు లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు.

### 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

తాళ్లపూడి: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి నరేష్ బుధవారం తెలిపారు. 10 నుంచి 15 మధ్య వయసు కలిగి, 6 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థుల కోసం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యార్థులకు నీతి కథలు, డ్రాయింగ్, సంగీతం, క్రాఫ్ట్స్, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

### మండల పరిషత్ సమావేశం వాయిదా

ఉండ్రాజవరం: బుధవారం ఉదయం నిర్వహించాల్సిన ఉండ్రాజవరం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీఓ ఏ. శ్రీనివాసు తెలిపారు. ఉదయం నుంచీ భారీ వర్షం కురిసింది. సమావేశానికి కోరం లేదు. ఈ కారణంగా ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి నిర్ణయం మేరకు సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీఓ చెప్పారు.

### పెన్షనర్లకు ఈ కేవైసీ నమోదు

తాళ్లపూడి: మండలంలోని పింఛనుదారులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈకేవైసీ చేశారు. కొవ్వూరులోని సబ్ ట్రెజరీ ఆఫీసు (ఎస్టీవో) నుంచి వచ్చిన అధికారులు మండలంలో పెన్షన్ పొందుతున్న వారి నుంచి వేలిముద్రలను సేకరించి ఈ కేవైసీ నమోదు చేశారు. రెండు రోజుల పాటు మండలంలోని 220 మంది పింఛనర్ల ఈకేవైసీ నమోదు చేస్తామని నమోదు అధికారినరసింహారావు తెలిపారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

గోపాలపురం: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కూడా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు గత సమావేశంలో వచ్చిన సమస్యలపై తీసుకున్న చర్యలు వివరించాలని ఎంపీడీఓ సూచించారు.

### పెద్దాపురంలో బైక్ దగ్ధం


కాలిపోయిన పల్సర్ బైక్

గోపాలపురం: మండలంలోని పెద్దాపురంలో బుధవారం వేకువజామున పల్సర్ బైక్‌కు దుండగులు తగలబెట్టారు. బైక్ పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన గంగుల రాజేష్ తన బైక్‌కు పొగాకు బ్యారన్ వద్ద పెట్టి ఇంట్లో నిద్రించాడు. బుధవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి బైక్ కాలిపోయి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారంటూ రాజేష్ గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ బైక్ విలువ రూ. 80 వేలు ఉంటుందని అతడా ఫిర్యాదులో పేర్కొన్నాడు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నిడదవోలు: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, తడిసిన, మొలకెత్తిన, రంగుమారిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కేఎస్ జవహర్ తదితరులు పాల్గొన్నారు.

### భార్యపై దాడి చేసిన భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే గాకుండా, ఆమెపై దాడికి పాల్పడిన భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ బుధవారం తెలిపారు. మండలంలోని జీడిగుంట గ్రామానికి చెందిన వెంకట నాగేశ్వరరావుతో కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం మోపర్రుకు చెందిన వీరమనేని ప్రియకు 11 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలంగా తన భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఆమె పేర్కొంది. ఈ క్రమంలో బుధవారం తనపై రాడ్డుతో భర్త నాగేశ్వరరావు దాడి చేశాడని తెలిపింది. తీవ్ర గాయాలై నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పెరవలి మండలం నల్లాకులవారిపాలెంలో ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాల లోడింగ్


పెరవలి మండలం ముక్కామలలో నీట మునిగిన వరి పైరు


నిడదవోలు- పంగిడి రహదారిలో రోడ్డుపై ఆర బోసిన ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం


వేగేశ్వరపురంలో వర్షం కురుస్తుండడంతో ధాన్యంపై కప్పిన బరకాలు

# నడి వేసవిలో ముసురు

- అన్నదాతలు ఉసూరు
- నాలుగు రోజులుగా వీడని వర్షం
- మొలకెత్తిన ధాన్యం
- ఉప్పును వెదజల్లుతున్న రైతులు

నిడదవోలు రూరల్: నడి వేసవిలో తొలకరి వాతావరణం .. ఎండలు మండిపోవాల్సిన తరుణంలో ముసురు పట్టడంతో అన్నదాతలకు కంటిమీద కునుకు ఉండడం లేదు. నిడదవోలు మండల వ్యాప్తంగా నాలుగో రోజైన బుధవారం కూడా జోరుగా వర్షం కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట నీటి పాలవడంతో ఆవేదన చెందుతున్నారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం కళ్లాల్లోంచి నీరు బయటకు వెళ్లకపోవడంతో ధాన్యం మొలకెత్తింది. విక్రయాలకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రవాణా చేసేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉప్పును వెదజల్లుతున్నారు. ఈదురు గాలులు, వర్షంతో నేలవాలిన పంట పొలాలను ఏవో జి.సత్యనారాయణ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో నష్టపోయిన పంట వివరాలను నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు. రైతులు వద్ద సిద్ధం ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నామన్నారు.

**పల్లపు వరి చేలు పూర్తిగా జలమయం**

పెరవలి: బుధవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయాయి. మండలంలో 72 హెక్టార్ల విస్తీర్ణంలోని వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపారు. బుధవారం నాటి వర్షంతో ఈ నష్టం అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. పల్లపు వరి చేలు పూర్తిగా జలమయం అయ్యాయి. నేల నంటిన వరి పంట భారీ వర్షాలకు పూర్తిగా నీటిలో నానుతోంది. ఇలా రెండు, మూడు రోజులు నానితే పంట మొత్తం కుళ్లిపోతుందని రైతులు చెబుతున్నారు. మండలంలో 8,500 ఎకరాల విస్తీర్ణంలో రబీ వరి సాగు చేయగా, ఇప్పటి వరకూ 3,090 ఎకరాల్లోని పంట మాసూళ్ళు పూర్తయ్యాయి. మరో 5,410 ఎకరాల్లోని పంట మాసూళ్ల జరగవలసి ఉందని ఏవో మేరీ కిరణ్ తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాశుల్లో, బస్తాల్లో ఉన్న ధాన్యం ఈ వర్షానికి ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.బుధవారం ఉదయం బాగా ఎండ కాయడంతో రైతులు రాశులను విడగొట్టి ధాన్యాన్ని ఆరబెట్టారు. కొద్దిసేపటికే హఠాత్తుగా వర్షం రావడంతో హడావుడిగా ఒబ్బిడి చేసుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే ధాన్యం తడిసిపోయింది.



సమిశ్రగూడెంలో మొలకెత్తిన ధాన్యం కాపాడుకునేందుకు ఉప్పును చల్లుతున్న దృశ్యం. (అంతరచిత్రం) సమిశ్రగూడెంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు గోపాలకృష్ణ

**గగ్గోలు పెట్టిన ఇటుక బట్టీ యజమానులు**

భారీ వర్షానికి ఇటుక బట్టీల యజమానులు గుడ్లు తేలవేశారు. లక్షలాది పచ్చి ఇటుకలు తడిసి పోవడంతో వారు తీవ్రంగా నష్టపోయారు. పెరవలి మండలంలో ఇటుక బట్టీలు 66 ఉండగా వాటి నుంచి రోజుకు 10 లక్షల ఇటుకలు తయారవుతాయి.

తాళ్లపూడి: అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ వర్షం కురిసింది. యంత్రాలతో కోసిన రబీ ధాన్యం తడిసిపోతోందని రైతులు వాపోతున్నారు. ఆరబోత కోసం రోడ్ల పైకి తరలించిన ధాన్యన రాశులు వర్షానికి తడవకుండా బరకాలు కప్పుతున్నారు. రోజూ వర్షం కురుస్తుండడంతో తయారైన వరి చేలు కోయడానికి వీలు కుదరడం లేదని చెబుతున్నారు.

**నేలకొరిగిన వరి పైరు**

చాగల్లు: అకాల వర్షాలు తమను నట్టేట ముంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో ఉన్నామని వారు అంటున్నారు. మండలంలో బుధవారం కూడా భారీవర్షం కురిసింది. చాగల్లు, ఊనగట్ల, ఎస్. ముప్పవరం, నందిగంపాడు, బ్రాహ్మణగూడెం తదితర గ్రామాల రైతుల ధాన్యం రహదారులపై, కళ్లాలోనే ఉన్నది. పలు గ్రామాల్లో ఈదురుగాలులకు వరి చేలు నేలకు ఒరిగిపోయాయి. పనలపై ఉన్న ధాన్యం మొలకలు వచ్చింది. నిడదవోలు-పంగిడి రహదారిపై పొడవునా రైతులు ఆరబెట్టిన ధాన్యం రాశులపై గత నాలుగు రోజులుగా బరకాలు కప్పి ఉంచారు. ఈ ధాన్యం తడిసి ముద్దయ్యిందని వారు తెలిపారు.

### రైతులను ఆదుకోవాలి


తాడిపూడిలో వరి పైరును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు

తాళ్లపూడి: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు కోరారు. మండలంలోని తాడిపూడి సహా పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆ పార్టీ మండల నాయకులతో కలిసి బుధవారం దత్తు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి అందిన వరి, అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గోకవరపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిక్కి నాగేంద్ర, ఆ పార్టీ నాయకులు కాలేపు సత్య సాయి, తిరుమలశెట్టి కృష్ణ, నామా రంగనాయకులు పాల్గొన్నారు.

### ఆరబోసిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించండి

- అధికారులకు జేసీ తేజ్ భరత్ ఆదేశం
- నందిగంపాడు ఆర్బీకేలో తనిఖీలు


నందిగంపాడు ఆర్బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

చాగల్లు: రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో వెంటనే కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశించారు. మండలంలోని నందిగంపాడు రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రోడ్లపై రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఆర్బీకేలోని రికార్డులు జేసి తేజ్ భరత్ పరిశీలించారు.గోనె సంచుల లభ్యత వివరాల గురించి ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నందిగంపాడు గ్రామంలోని రైస్‌మిల్లుకు జేసీ వెళ్లి రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లో బుధవారం 86.32 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కె.నిరంజన్ కుమార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మమ్మ వారికి విశేష పూజలు


విశేష అలంకరణలో మహాలక్ష్మమ్మ వారు

చాగల్లు: చాగల్లు అమ్మవారైన మహాలక్ష్మమ్మ వారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు, పురోహితుల వేదమంత్రాల మధ్య అమ్మవారి మహోత్సవానికి కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం సాయంత్రం భజన కాలక్షేపం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయం వద్ద హోమాలు, మహాపూర్ణాహుతి, వేద పండితులతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ గ్రామ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. ప్రతిష్ఠా మహోత్సవాల నిర్వాహకులు ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు, ఉప్పులూరి రమేష్‌లతో పాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఐ.పంగిడి మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, సర్పంచ్ గోశాల నాగర్జున తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత. (అంతర చిత్రం) కనకదుర్గ అమ్మవారు

## సందడిగా వేంకటేశుని కల్యాణోత్సవాలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు మూడో రోజైన బుధవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుండే భక్తులు రావడం ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలకే భక్తులు ఆలయ ప్రాంగణం చుట్టూ వేచి ఉన్నారు. క్యూలైన్ జాతీయ రహదారిపైకి వచ్చింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. వందలాది మంది భక్తులు స్వామివారికి తల నీలాలు సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా వైఎస్సార్ సీపీ నాయకుడు పంతం చిన్న యూత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో పిల్లలకు పాలు, పెద్దలకు సత్యనారాయణస్వామి వారి బూంది ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నసమారాధనలో బుధవారం ఒక్కరోజే ఐదు వేల మంది స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం స్వామి వారి కల్యాణాన్ని మల్లేశ్వరం గ్రామానికి చెందిన కోటిపల్లి మల్లయ్య కుటుంబ సభ్యులు నిర్వహించారు.


విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

## విద్యార్థులు దృఢ సంకల్పంతో సాగాలి

నల్లజర్ల: దృఢ సంల్పంతో ముందుకు సాగితే విద్యార్థులు దేనినైనా సాధించగలరని రామకృష్ణ మఠం రాజమహేంద్రవరం శాఖ మహరాజ్ స్వామి సేవ్యానంద అన్నారు. రామకృష్ణమఠం రాజమహేంద్రవరం శాఖ 125వ వార్షికోత్సవాల సందర్భంగా నల్లజర్లలోని ఏకేఆర్జీ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం పలు ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించారు. రామకృష్ణ సేవాసమితి నల్లజర్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవ్యానంద మాట్లాడుతూ తనలో నిగూఢంగా ఉన్న అనంతమైన శక్తిని గుర్తిస్తే ప్రతి విద్యార్థీ అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. అయితే చాలా మంది విద్యార్థులు తామేమీ సాధించలేమనే నిరాశ, నిస్పృహలతో కునారిల్లుతున్నారన్నారు. బంగారం, వజ్రాలు, వైఢూర్యాల కంటే విలువైన శక్తి విద్యార్థుల్లో దాగి ఉందన్నారు. ఎటొచ్చీ సక్రమ మార్గంలో వినియోగించుకోవాలన్నారు. దానికి ఆధ్యాత్మిక శక్తి తోడు కావాలన్నారు. ఆలోచనలు కల్మషం లేకుండా ఉన్నతంగా ఉండాలన్నారు. మరో అతిథి, స్వామివేద విద్యానంద కూడా మాట్లాడారు. ఏకేఆర్జీ విద్యాసంస్థల చైర్మన్ చావా గోఖుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. రామకృష్ణ సేవాసమితి తాడేపల్లిగూడెం శాఖ అధ్యక్షుడు వర్మ, నల్లజర్ల సేవాసమితి అధ్యక్షులు అల్లాడ రామకృష్ణ, యండగండి సమితి అధ్యక్షుడు రామకృష్ణ ప్రభాకర వర్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆధ్యాత్మిక అంశాలు బోధిస్తున్న స్వామి సేవ్యానంద

### ఏఈఓ విధుల మార్పు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలి దర్శన వివాద విషయంలో ఆలయ ఏఈఓ విధులను మార్పు చేస్తూ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవారి దర్శనార్థం మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ట్రస్టు బోర్డు సభ్యురాలు బోడపాటి మౌనిక తనను ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు అవమానించారని ఆరోపించింది. విచారణ చేపట్టిన ఆలయ ఈఓ త్రినాథరావు ఏఈఓ దుర్గారావును గో సంరక్షణ శాలకు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓ పి.నటరాజారావును ఆలయ కార్యాలయానికి బదిలీ చేశారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన

- ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం సేకరిస్తుంది
- టీడీపీ చేపట్టిన రైతు గళానికి స్పందన కరవు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ చేపట్టిన రైతు గళం కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన కరవైందన్నారు. టీడీపీ వారు ఎన్ని పాదయాత్రలు చేసినా రైతులు స్పందించే పరిస్థితి లేదన్నారు. రబీలో పండించిన ప్రతి గింజకూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసినట్టు తలారి చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి తొమ్మిది రోజుల్లోనే సొమ్ము చెల్లించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.130 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటికే రైతులకు రూ.90 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అయితే గ్రామాల్లోని టీడీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టి ఉద్యమాలు చేస్తున్నారని విమర్శించారు. వారం రోజులుగా మిల్లులకు ధాన్యం తరలింపు వేగంగా జరుగుతోందన్నారు. రోడ్లపైన, కళ్లాల్లోను ఉన్న ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకున్నట్టు తెలిపారు. టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే తలారి తీవ్రంగా ఖండించారు. రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. రైతు గళంలో ఎక్కడా రైతులు కనపించలేదన్నారు.

**కండిగలమ్మ ఆలయానికి శంకుస్థాపన**

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలను కుంటకు వెళ్లే మార్గంలోని చిలుకూరి ధర్మారావు తోటలో కండిగలమ్మ అమ్మవారి ఆలయానికి బుధవారం ఉదయం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఎంపీటీసీ పెద్దిరెడ్డి రమ్యకుసుమ, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు గుర్రాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

### విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక నాయకులు

కొవ్వూరు: 'ఉక్కు మాదే - దానిపై హక్కూ మాదే' అని నినదిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలువురు స్థానిక మెరక వీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. 32 మంది బలిదానంతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంటును పరిరక్షించుకోవడానికి ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని నాయకులు ప్రకటించారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించకుండా గనులను కేటాయించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు, మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బొంతా శ్యాంర విప్రకాష్, విశ్రాంత ఉద్యోగి పెనుమాక జయరాజు, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు గంధం బాపూజీ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విజయవాడలో రాస్తారోకో చేస్తున్న పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు.

### కొవ్వూరు భారీ వర్షం


కొవ్వూరులో కోర్టు ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షపు నీరు

కొవ్వూరు: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. అర గంటకు పైగా కుండ పోతగా వర్షం కురిసింది. దీంతో కోర్టు ప్రాంగణంలోని లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోయింది.అగ్నిమాపక కేంద్రం, పట్టణ పోలీసు స్టేషన్ వద్ద అడుగు లోతున నీరు నిలిచిపోయింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి బుధవారం ఎనిమిది గంటల వరకూ చాగల్లులో గరిష్టంగా 33.8 మిల్లీమీటర్లు, తాళ్లపూడిలో 25.2, కొవ్వూరులో 9.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.బుధవారం మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం పడింది.